ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 27-01-2026 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు.
2. ప్రజా ప్రభుత్వంలో దివ్యాంగులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తామని, వారికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను నిరంతరం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.
3. విద్యారంగంలో నల్లగొండను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.
4. ములుగు జిల్లాలోని మేడారంలో రేపటి నుంచి సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

-----------------------------

**కిషన్ రెడ్డి-గవర్నర్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాద్ యూసుఫ్ గూడలోని జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంస్థ NI-MSME వేదికగా అటల్ బిహారీ వాజపేయి -ABV ఫౌండేషన్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి ఆయన ధృవపత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సైన్యం నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు అన్ని రంగాల్లో మహిళలు రాణించేలా కేంద్రం ప్రోత్సహిస్తోందన్నారు. బ్యాంకును పేద వారికి చేరువ చేసిన కేంద్రం ప్రభుత్వం 51 కోట్ల జన్ ధన్ ఖాతాలను తెరిచిందని తెలిపారు. చిరు

వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తూ స్వయం సమృద్ధికి ABV ఫౌండేషన్ తోడ్పడుతోందని తెలిపారు.

**బైట్ కిషన్ రెడ్డి**

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు ఏబీవీ ఫౌండేషన్ అందిస్తున్న శిక్షణ, బ్యాంక్ రుణాల చొరవను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీ ఫౌండేషన్ చైర్ పర్సన్ కావ్య కిషన్ రెడ్డి, MSME డైరెక్టర్ శ్రీకాంత శర్మ, చింతల రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

(డెస్క్)

-------------------------

**భట్టి-దివ్యాంగులు**

గత పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని తమ ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించిందని, దివ్యాంగుల సంక్షేమం కోసం ఈ కాలంలోనే 100 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా ప్రభుత్వంలో దివ్యాంగులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తామని, వారికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను నిరంతరం అందిస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ కేంద్రంలో ఈ రోజు దివ్యాంగులకు మూడు చక్రల సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకునే దివ్యాంగ విద్యార్థులకు ఐపాడ్లు, కంప్యూటర్లు, ట్యాబ్ లను ప్రజా ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. దివ్యాంగులను సమాజంలో మనతో పాటు సమానంగా ముందుకు నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని భట్టి విక్రమార్క అన్నారు. అంగవైకల్యంతో జన్మించిన వారి పట్ల సమాజం సానుకూల దృక్పథంతో ఉండాలని, వారు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని కోరారు.

**ఖమ్మం – పీటీసీ**

--------------------------

నల్లగొండ - కోమటిరెడ్డి

విద్యారంగంలో నల్లగొండను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతానని రాష్ట్ర రోడ్డు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు కోమటిరెడ్డి ప్రతిక్ మెమోరియల్ సంస్థ ద్వారా విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రంలో బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలకు తమ కోమటిరెడ్డి ప్రతీక్ సంస్థ ద్వారా దాదాపు 8 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక పాఠశాల భవనాన్ని మంత్రి ఈ ఉదయం ప్రారంభించారు. కార్పొరేట్ స్థాయికి దీటుగా ఏసీ గదులు, డిజిటల్ క్లాస్ రూములు వంటి సకల వసతులతో ఈ పాఠశాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో పాటు తమ సొంత సంస్థ ద్వారా విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే నల్గొండలో తమ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇతర పాఠశాలలను నిర్మించామన్నారు.

(పిటిసి నల్లగొండ జిల్లా)

--------------------------

**మేడారం జాతర**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. రేపు సాయంత్రం సారలమ్మ గద్దెపైకి రాకతో ఈ వేడుకలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. దాదాపు కోటి మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్న ప్రభుత్వం జాతర ప్రాంగణాన్ని 8 జోన్లు, 42 సెక్టార్లుగా విభజించి భారీ ఏర్పాట్లు చేసింది. 42 వేల మందికి పైగా ప్రభుత్వ సిబ్బంది విధుల్లో ఉండగా, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ 4 వేల బస్సులను నడుపుతోంది. భక్తుల భద్రత కోసం పోలీస్ శాఖ అత్యాధునిక కృత్రిమ మేధను వాడుతోంది. 13 వేల మంది పోలీసులతో పాటు 450 సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచనున్నారు. జంపన్న వాగు వద్ద భక్తుల స్నానాలకు ఇబ్బంది కలగకుండా నీటి ప్రవాహాన్ని క్రమబద్ధీకరించి, గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచారు. వైద్య, పారిశుద్ధ్య సేవలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

మేడారంలో 50 పడకల ఆసుపత్రితో పాటు 30 హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేసి, 5 వేల మందికి పైగా వైద్య సిబ్బందిని నియమించింది.

(డెస్క్)

----------------------

**ఫోన్ ట్యాపింగ్-సంతోష్ రావు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం ఈరోజు విచారించింది. కేసులో విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు నిన్న సంతోష్ రావుకు నోటీసులు జారీ చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ జుబ్లీహిల్స్ లో పోలీస్ స్టేషన్ కు రావాలని సూచించారు. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రులు కె. తారక రామారావు, తన్నీరు హరీశ్ రావును సిట్ అధికారులు ప్రశ్నించారు.

(డెస్క్)

-----------------------

**కవిత**

రాష్ట్రంలో నేరాలు పెరిగిపోయి శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి, నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను ఈరోజు పరామర్శించారు. సౌమ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కవిత, విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులు జరగడం దారుణమని, నేరగాళ్లను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఎక్సైజ్, అటవీ శాఖ అధికారుల వద్ద ఆయుధాలు లేకపోవడం వల్లే స్మగ్లర్లు ఇలా దాడులుకు తెగబడుతున్నారని, తక్షణమే వారికి తిరిగి ఆయుధాలు కేటాయించాలని కవిత డిమాండ్ చేశారు.

(డెస్క్)

--------------------------

**సిరిసిల్ల-ఉజ్వల యోజన పథకం**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు చేస్తున్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణానికి చెందిన, ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిదారు రావుల శ్రీలేఖ చెప్పారు. ఆకాశవాణితో ఆమె మాట్లాడుతూ...

(సౌండ్ బూట్ రావుల శ్రీలేఖ)

( పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

-----------------------

**ఈటల-మల్కాజ్ గిరి**

మల్కాజిగిరిలో రెండు ఆర్వోబీ బ్రిడ్జీలకు మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తో పాటు రైల్వే ఉన్నతాధికారులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. త్వరలోనే మల్కాజ్ గిరి-మేడ్చల్ నియోజకవర్గం లోని అన్ని రైల్వే లెవల్ క్రాసింగ్ ల వద్ద ఆర్మోబీ బ్రిడ్జీలను నిర్మిస్తామని ఈటల రాజేందర్ తెలిపారు.

**పీటీసీ – మేడ్చల్ మల్కాజ్ గిరి**

--------------------------------

**సంగారెడ్డి-స్టడీ సర్కిల్**

సంగారెడ్డి జిల్లాలోని TG SC స్టడీ సర్కిల్లో గ్రూప్-1, 2, 3, 4, ఆర్ఆర్బీ, ఎస్ఐ, కానిస్టేబుల్ వంటి పోటీ పరీక్షలకు 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు అదనపు కలెక్టర్ ఆర్. పాండు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన డిగ్రీ పూర్తి చేసి, 3 లక్షల రూపాయలలోపు వార్షిక ఆదాయం కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఫిబ్రవరి 8న సిద్దిపేటలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

(పీటీసీ, సంగారెడ్డి)

---------------------

**మహబూబ్ నగర్ -TGSPDCL**

మహబూబ్ నగర్ జిల్లాలో  విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి  కృషి చేస్తున్నామని  జిల్లా TGSPDCL సూపరింటెండెంట్ ఇంజనీర్ భీమా నాయక్ తెలిపారు. ప్రజా బాటలో భాగంగా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. తక్కువ ఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు  ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు  వేలాడే తీగలను సరి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

(పీటీసీ, మహబూబ్ నగర్)

----------------------

బ్యాంకుల సమ్మె

వారానికి ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్ తో నేడు దేశవ్యాప్తంగా పలు బ్యాంకు ఉద్యోగులు ఒక్కరోజు సమ్మెకు దిగారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు హైదరాబాద్ లోని కోఠిలో ఉన్న ఎస్బీఐ ప్రాంతీయ ప్రధాన కార్యాలయం ముందు ఉద్యోగులు ధర్నా చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సమ్మె ప్రభావంతో ఎస్బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్ వంటి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో లావాదేవీలు నిలిచిపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

(డెస్క్)

----------------

**ఆసిఫాబాద్ -బ్యాంకుల సమ్మె**

బ్యాంకు యూనియన్ల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపుమేరకు ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో పలు బ్యాంకులు మూతపడ్డాయి. మూడు

రోజుల నుంచి వరుస సెలవులు కావడంతో బ్యాంకుల సమ్మె విషయం తెలియక బ్యాంకుల దగ్గరికి చేరుకున్న ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

---------------------

**వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం మేడారం జాతరకు వెళ్లే భక్తులతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకునే ముందు వేములవాడ స్వామివారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ కావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి ఈ రోజు భక్తులు భారీగా తరలివచ్చారు. అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయం భక్తులతో పోటెత్తగా, వేలాది మంది తలనీలాలు సమర్పించి, కోడెల మొక్కులు, అభిషేకాలు, కల్యాణాలు వంటి పూజలు నిర్వహించారు.

(పీటీసీ, సిరిసిల్ల)

-------------------------

**రాజన్న సిరిసిల్ల జిల్లా-మత్తు పదార్థాలు**

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికా రులను ఆదేశించారు.

(పీటీసీ, సిరిసిల్ల)

--------------------

**వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ  శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయ గోవులకు సంబంధించి, వేములవాడ రూరల్ మండలం మర్రిపెల్లి గ్రామంలో స్థలం గుర్తించామని  జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, ఆలయానికి అనుబంధంగా, ఆదినాధన పద్ధతుల్లో గోశాలలు నిర్మిస్తామని  తెలిపారు.

**(పిటీసి రాజన్న సిరిసిల్ల జిల్లా)**

---------------------------

**ఇందిరమ్మ చీరలు-మహబూబాబాద్**

అర్హులైన  మహిళలందరికీ ఇందిరా మహిళా చీరలను అందచేస్తామని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ అన్నారు. మహబూబాబాద్  జిల్లా కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మండపంలో ఇందిరా మహిళా చీరలను  ఎమ్మెల్యే పంపిణి చేశారు.

**(మహబూబాబాద్ జిల్లా, పి.టి.సి)**

--------------------------